# నీ గుండె తడినై...

ఢిల్లీ-

ప్రఖ్యాత 'హార్ట్‌కేర్' సెంటరది!

పాతిక దాటిన మాధవ్ మరణశయ్య మీద ఉన్నాడు. హఠాత్తుగా గుండె జబ్బు మొదలయ్యిందతనికి. గుండె మార్పిడే శరణ్యం.

మాధవ్ కంటే కాస్త వయసులో చిన్నదైన రాధ... అతడిలాగే అంతు చిక్కని గుండె జబ్బుతో చేరిందక్కడ.

ఆ అపురూప అందాలరాశి కంటపడగానే... ఏజన్మ బంధమో... హృదయానుబంధమై... అతడి గుండె పొరల్ని... ప్రణయంతో ముడివేసింది...!

మృత్యు ఒడిని చేరబోతున్న ఈ తరుణంలో-

శిథిలమైన గుండెకి... ఈ ప్రణయపు తడేంటని... అంతరాత్మ

మందలిస్తున్నా... మనసు మారాం చేసింది.

తనువులోని అణువణువూ... తపో ముద్రతో... మోకరిల్లింది.

రాధది పుట్టుకతో వచ్చిన గుండెజబ్బు. వైద్యం లేదు. ఆమెకి కూడా గుండె మార్పిడే మార్గం.

ఈ ఇద్దరికీ తగిన గుండెలెప్పుడు దొరుకుతాయో తెలియదు.

అయినా తొందర్లోనే రాధకు దగ్గరైన మాధవ్... నిత్యం కబుర్లు చెబుతూ... ఆ అమ్మాయికి బతుకు మీద ఆశ చివురింపచేశాడు.

అలాంటి సమయంలో...

అనూహ్యంగా... ఆక్సిడెంటైన ఓ వ్యక్తి గుండె డొనేట్ చేయబడింది. ముందు చేరిన మాధవ్‌కి శస్త్ర చికిత్స ఏర్పాట్లు జరుగుతుంటే... అతడొప్పుకోలేదు.

తన గుండె చితికినా... ప్రేయసి బ్రతకాలని... వేడుకున్నాడు.

డాక్టర్స్ సరేనని... పేషెంట్స్ లిస్ట్‌లో ఆరో స్థానంలో ఉన్న రాధకి వైద్యం చేసి, మాధవ్‌ని ఆ స్థానంలోకి మార్చేసారు.

బాగుపడిన రాధ గుండె నిండా ప్రాణదాత, త్యాగశీలి మాధవ్ చోటు చేసుకున్నాడిపుడు!

అతడి గుండె స్పందనల కోసం... ఆమె గుండె పరితపిస్తోంది...

కొన 'ఊపిరి'తో ఉన్న మాధవ్ కోసం... రాధ 'శ్వాస' కొట్టు మిట్టాడుతోంది...

ఆర్ద్రతాభరితమైన ఈ రెండు గుండెల కోసం... మరో గుండె రాకెపుడో...?

వేచి, చూద్దాం...!

(ఫిబ్రవరి, 2012)

*